క్లుప్తంగా

దాడి అమానుషం



నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు

విజయనగరం అర్బన్: తిరుపతి జిల్లాలోని ఎస్వీ యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ చంగయ్యపై దాడి చేయడం అమానుషమని బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మత బోధనలు చేస్తున్నారనే నెపంతో కక్షపూరితంగా ప్రొఫెసర్ చంగయ్య చాంబర్‌లోకి ప్రవేశించి అతనిపై దాడి చేశారని ఆరోపించారు. అనంతరం కారులో ప్రయాణం చేస్తున్న సమయంలో దారిలో అడ్డగించి కారుని ధ్వంసం చేశారని మండిపడ్డారు. దాడిపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోమ రాంబాబు, జిల్లా అధ్యక్షుడు కె.సోములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌జే రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎ.పైడిరాజు, పి.శంకరరావు, ఎస్.పైడిరాజు, పీపీ రమణ, బి.యేసు, ఎల్లిబాబు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫారాల వితరణ



రాజేశ్వరి అందజేసిన టీ షర్టులను ధరించిన విద్యార్థులు

భోగాపురం: మండలంలోని కొంగవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మక్కువ రాజేశ్వరి రూ.6 వేల విలువ చేసే టీ షర్టులను (యూనిఫారం) 25 మంది విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో వీటిని అందించినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆళ్ల వెంకటేష్, ఉపాధ్యాయులు పబ్బిరెండి శివప్రసాద్, సీఆర్‌పీ మాత శేషుబాబు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ కరగాని ఉమ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్ను చెల్లించాల్సిందే..



పన్ను వసూలును పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన ప్రజలు ఈ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని కమిషనర్ కె. అప్పలరాజు స్పష్టం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులో ఆస్తి పన్ను వసూళ్లను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోగా పన్ను చెల్లించకుంటే రెండు శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణవాసులు వెంటనే పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, సచివాలయ కార్యదర్శి రమణ, తదితరులున్నారు.

రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందించాలి



పెద బూరాడపేటలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రామారావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేటలో సుమారు 150 గొర్రెలు మృతి చెందాయని.. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన గ్రామానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా గొర్రెలు పొలాల్లో మేత మేసి మృతి చెందాయన్నారు. భారీ స్థాయిలో గొర్రెలు మృతి చెందడంతో పేద రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.20 లక్షల నష్టపరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బాధితులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నీలంరాజుపేటకు చెందిన ఓ మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన జలుమూరు పెంటమ్మ (45) గత నెల 29న బ్యాంక్‌కు వెళ్తానని చెప్పి ఇంతవరకు ఇంటికి చేరుకోలేదన్నారు. అప్పులు ఎక్కువగా ఉండడంతో ఒత్తిడి భరించలేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసిందని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

- ఏళ్లు గడుస్తున్నా గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సు
- ప్రజలతో పాటు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఇదే అదునుగా దోచుకుంటున్న ఆటోవాలాలు

బస్సు సౌకర్యం లేని ద్వారపూడి గ్రామం



ఆ గ్రామాలపై.. చిన్న చూపెందుకో...!

విజయనగరం రూరల్: ఏ గ్రామానికి రోడ్డు ఉందో ఆ ఊరుకు ఆర్టీసీ బస్సు వెళ్తుందని ఆర్టీసీ ప్రకటన ఆచరణలో అమలు కావడం లేదు. విజయనగరం మండలం పరిధిలోని చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న 22 పంచాయతీల్లో ఏ గ్రామానికి వెళ్లాలన్నా ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలు ఏర్పాటైనప్పటి నుంచి ఏ రోజూ ఆ గ్రామాలకు ఆర్టీసీ బస్సు రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో సామాన్య ప్రజలతో పాటు కళాశాల, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరకు చేసేదేమీ లేక ప్రమాదం పొంచి ఉన్నా ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. విజయనగరం మండలంలో జొన్నవలస, బియ్యాలపేట, కోరుకొండపాలెం, పినవేమలి, రాకోడు, పడాలపేట, కొండకరకాం, ద్వారపూడి, గుంకలాం, నారాయణపురం, సుంకరిపేట, మలిచెర్ల, బడుకొండిపేట, దుప్పాడ, సారిక, చిల్లపేట, ముడిదాం, చెల్లూరు, గొల్లపేట, గుండాలపేట, కొత్తకాపుపేట వంటి పలు గ్రామాలున్నాయి. సుమారు 37 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు.

తప్పని ఇబ్బందులు..

మండలంలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాక నానా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజూ గ్రామాల నుంచి 30 శాతం మంది ప్రయాణికులు విజయనగరం వస్తుంటారు. ప్రధానంగా కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం అయితే ఆటోలు కూడా రావడం లేదు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– వెంపడాపు గౌరినాయుడు, ద్వారపూడి గ్రామం

అయితే కొంతమంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తుంటే.. మరికొంతమంది ఆటోల్లో ప్రయాణం చేయడం జరుగుతోంది. అయితే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు. కనీసం రెండు పల్లెవెలుగు బస్సులనైనా మండలంలోని పలు గ్రామాలకు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి తీసుకురాలేదు..

ఆర్టీసీ బస్సులు కావాలని మండలంలోని 22 పంచాయతీల ప్రజలెవ్వరూ మా దృష్టికి తీసుకురాలేదు. విషయం తెలియజేస్తే రూట్ సర్వే నిర్వహించి, 50 మంది ప్రయాణికులకు తక్కువ కాకుండా ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

శ్రీనువాసరావు, ఆర్టీసీ డీఎం, విజయనగరం

ఆటోలే శరణ్యం..

విజయనగరం మండలంలో సుమారు 22 గ్రామాలున్నా ఏ గ్రామానికి వెళ్లాలన్నా ఆటోను ఆశ్రయించాల్సిందే. అవి కూడా సమయానికి అందుబాటులో ఉండవు. ఒక్కోసారి కిక్కిరిసిన ప్రయాణికులతో ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు కూడా జరిగిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని బస్సులను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్య షష్టికి ఏర్పాట్లు పూర్తి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి, తదితరులు

- ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, స్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి తెలిపారు. బుధవారం స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో షష్టి మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం 4 గంటలకు కావడి ఉత్సవంతో ఊరేగింపు.. శనివారం స్వామివారి షష్టి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు లక్ష పుష్పార్చన.. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి శ్రీనివాస గోపాలకృష్ణ, కోశాధికారి సతీష్‌కుమార్, దువ్వు శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, పైడిరాజు, ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ, సీఈఎంఎస్ మధ్య అవగాహన



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్‌టీయూ, సీఈఎంఎస్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి మేరీటైమ్, షిప్‌బిల్డింగ్ కేంద్రం (సీఈఎంఎస్)తో జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వర్సిటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు బుధవారం యూనివర్సిటీ ప్రాంగణంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమతో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో సీఈఎంఎస్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, రిజిస్ట్రార్ జయసుమ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాబులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు, ఎలక్ట్రికల్ అండ్ ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.పద్మజ, ఎస్‌డీసీ సమన్వయ కర్త డాక్టర్ ఎం.హేమ, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ టీఎస్ఎన్‌మూర్తి, డాక్టర్ బి.తిరుమలరావు, సీఈఎంఎస్ మార్కెటింగ్ మేనేజర్ లివింగ్స్టన్ ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి..



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పట్టణ పౌరసంక్షేమ సంఘ ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు

- స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు..
- పట్టణ పౌర సంక్షేమ సంఘ సభ్యులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయడం, అదానీతో విద్యుత్ ఒప్పందాలను నిలిపివేయడంతో పాటు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. విజయనగరం అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీల అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. చంద్రబాబు నాడు ప్రపంచ బ్యాంకు జీతగాడుగా పాలించాడు.. నేడు అదానీకి అమ్ముడుపోయి విద్యుత్ చార్జీలు పెంచాడని ఆరోపించారు. ఇది చాలదన్నట్లు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో మోసానికి సిద్ధపడుతున్నాడని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు తగ్గించేవరకూ ఉద్యమం ఆపేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలూరి రమణమ్మ, ఆప్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రమేష్‌రాజా, కేవీపీఎస్ జిల్లా కార్యదరి రాకోటి ఆనంద్, రాజగోపాల్, హరీష్, రవి, అభివృద్ధి వేదిక జిల్లా అధ్యక్షుడు పి. షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 7న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశానికి తల్లిదండ్రులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో వివరించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సమావేశం నిర్వహిస్తోందన్నారు. అలాగే పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధనా తీరును సమావేశంలో వివరిస్తామన్నారు. తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొని, తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఫుట్‌పాత్ దుకాణాల తొలగింపు



చిరు దుకాణాలను తరలిస్తున్న సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిరు వ్యాపారులపై కార్పొరేషన్ యంత్రాంగం కొరడా ఝులిపిస్తోంది. కొద్ది రోజులుగా ప్రధాన రోడ్లకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్న వారిని ఆయా ప్రాంతాల నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా కోట, మూడు కోవెళ్లు, తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబళ్లు, దుకాణాలను బుధవారం తొలగించారు. కొంతమంది స్వచ్ఛందంగా తమ బళ్లను వేరే ప్రాంతాలకు తీసుకెళ్లిపోయారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లపై ఎటువంటి వ్యాపారాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి, సహకరించాలని కోరారు.

ఘనంగా వాసవీ క్లబ్ రజతోత్సవం



క్లబ్ రజతోత్సవంలో పాల్గొన్న సభ్యులు

విజయనగరం రూరల్: వాసవీ క్లబ్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఏవీఎస్ఎన్ గుప్తా మాట్లాడుతూ.. క్లబ్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. క్లబ్ సభ్యులు సమాజహితం కోరుతూ ముందుకు సాగాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు కుట్టుమిషన్లు అందించడం.. సరస్వతీదేవి పథకం ద్వారా పేద విద్యార్థులకు వడ్డీలేని రుణాలు అందించడం.. వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పూర్వ అధ్యక్షుడు రమణమూర్తి మాట్లాడుతూ.. క్లబ్ సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం క్లబ్ సభ్యులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రత్నారావు, మురళీకృష్ణ, సాంబమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

వన భోజనాలు..



నెల్లిమర్ల మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల వన భోజనాల కార్యక్రమం బుధవారం సందడిగా జరిగింది. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో సందడిగా గడిపారు. – నెల్లిమర్ల

అందుబాటులో పుష్‌కార్ట్‌లు..



ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం కొత్త పుష్‌కార్ట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. నగర వీధులను పరిశుభ్రం చేసేందుకు సచివాలయానికి రెండు చొప్పున పుష్‌కార్ట్‌లను కేటాయించారు. ఈ మేరకు సిబ్బందికి ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బుధవారం అందజేశారు. 50 డివిజన్‌లలో విస్తరించి ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక్కో డివిజన్‌కు రెండు పుష్‌కార్ట్‌లు చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన 50 పుష్‌కార్ట్‌లను చెత్త అధికంగా ఉత్పన్నమయ్యే వాణిజ్య ప్రాంతాల్లో వినియోగించనున్నట్లు ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

పరిశీలన...



కేంద్ర మానవ వనరుల, విద్యాశాఖ ఆధ్వర్యంలో పిల్లల సమగ్రాభివృద్ధి, శక్తి సామర్థ్యాలను అంచనా వేసేందుకు నిర్వహించిన రాష్ట్రీయ సర్వేక్షణ్ (పరఖ్) పరీక్షను మండల విద్యాశాఖాధికారి వి.శ్రీరామ్ పరిశీలించారు. జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు.. భవానీ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష నిర్వహించారు. ఎంఈఓతో పాటు డైట్ లెక్చరర్ ఈశ్వరరావు, సీఆర్‌పీలు రామకృష్ణ, మహేష్ పరిశీలించారు. – డెంకాడ

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

డెంకాడ: గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు కోరారు. ఈ మేరకు గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పది వేల రూపాయల జీతం ఇవ్వడంతో పాటు బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియా, దహన సంస్కారాలకు రూ. 15 వేలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ భవానీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- సీఐ లంక అప్పలనాయుడు



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సీఐ లంక అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: సైబర్ నేరాలపై అవగాహన కళాశాల స్థాయి నుంచే పెరగాలని సైబర్ క్రైమ్ సీఐ లంక అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహరాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల సంయుక్తంగా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోషల్ మీడియా, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతో పాటు క్రైమ్ చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్షణికావేశాల వల్ల చైల్డ్ పోర్నోగ్రఫీ జరుగుతుందని.. మనకు పడని వ్యక్తుల పరువు ప్రతిష్టలు దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఫొటో మార్ఫింగ్‌లు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైక్రియాటిస్ట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జి.హిమబిందు, సీనియర్ న్యాయవాది ఐ.సురేష్ మాట్లాడుతూ.. మీడియా, సోషల్ మీడియా, క్రైమ్, సైబర్ క్రైమ్ మధ్య ఉన్న తేడాలను వివరించారు. కో ఆర్డినేటర్లుగా డాక్టర్ బీవీఎస్ జయపాల్, వావిలాపల్లి సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దన్‌నాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, రాగస్వామి, అధ్యాపకులు డాక్టర్ పి.జయలక్ష్మి, డాక్టర్ పి.రూపవాణి, ఎం.రమాగీతాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.